# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- కృత్రిమ మేధ ద్వారా అద్భుతాలను సాధించగలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.
- ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది.
- రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి హ్యాండ్లూమ్ కి, పవర్ లూమ్ కి ఉచిత విద్యుత్ ని అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 131వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.
- గిరిజన ప్రాంతాలలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను మంజూరు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

====================

కృత్రిమ మేధ ద్వారా సమీప భవిష్యత్తులో అద్భుతాలను సాధించగలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' రౌండ్ టేబుల్ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న కృత్రిమ మేధ ద్వారా పోటీతత్వం అంశంపై ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు ద్వారా అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను ఉపయోగించుకుని దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అమరావతి క్వాంటం వ్యాలీతో పాటు, గూగుల్ లాంటి సంస్థల రాకతో ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

====================

ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో కుదుర్చుకున్న ఈ ఒప్పందాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో కుదిరాయి. రాష్ట్రంలో క్వాంటం-ఏఐ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన దిశగా ఈ ఒప్పందాలు ఉపయోగపడనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రాన్ని క్వాంటం-ఏఐ హబ్ గా తీర్చిదిద్దడం అమరావతిలోని క్వాంటం వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి ఈ ఒప్పందాలు ఉపయోగపడనున్నాయి. అదే విధంగా ఏఐ-క్వాంటం ఎకో సిస్టం పెంపొందించడానికి బాటలు వేసేలా ఈ ఏడు ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. అలాగే భవిష్యత్ సాంకేతికతను అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ-క్వాంటం రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ-క్వాంటం వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారిస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి.

====================

రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి హ్యాండ్లూమ్ కి 200 యూనిట్లు, పవర్ లూమ్ కి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ని అందిస్తామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శాసనసభలో బడ్జెట్ పై చర్చలో భాగంగా ఆయన ఈరోజు మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రోజుకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ సబ్సిడీ ద్వారా 22 లక్షల మంది రైతులు లబ్ది పొందుతున్నారని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈ ఆదివారం 22వ తేదీన ప్రసారమవుతుంది.

====================

రాష్ట్రంలో నేరాల రేటు ఆరు శాతానికి తగ్గిందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. హోం శాఖ బడ్జెట్ డిమాండ్‌ను శాసనసభలో ఈరోజు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. శాంతి భద్రతలను కాపాడే విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హోం మంత్రి స్పష్టం చేశారు.

====================

విరామం

====================

రాష్ట్ర భవిష్యత్తును సమగ్రంగా మార్చేలా ఖనిజ వనరుల్ని సద్వినియోగం చేసుకుంటామని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శాసనసభలో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర సహా సుమారు 970 కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీరంలో అపారమైన సహజ సంపద ఉందని తెలిపారు. దానిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపే అవకాశం లభిస్తుందన్నారు. అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్ ప్లోరేషన్ అండ్ రీసెర్చ్‌పై ఆధారపడి, దాదాపు 102 మిలియన్ టన్నుల నిల్వలతో రాష్ట్ర ప్రభుత్వం 7వేల 762 హెక్టార్లలో 8 బీచ్ శాండ్ కలిగి ఉన్న ప్రాంతాలను గుర్తించిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న మోనోజైట్ నిల్వలలో రాష్ట్రంలోనే 30 శాతానికి పైగా ఉన్నాయని గుర్తు చేశారు.

====================

గిరిజన ప్రాంతాలలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను మంజూరు చేశామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర శాసనసభలో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. 246 కోట్ల రూపాయలతో వీటి నిర్మాణం చేపడతామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...22 సెకన్లు)

====================

జనాభా లెక్కల సేకరణ విషయంలో జిల్లా ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులైన జిల్లా కలక్టర్లు కీలకపాత్ర పోషించాలని డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ వివిఎల్ఎన్ శర్మ కోరారు. జన గణన-2027పై ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులతో రాష్ట్రస్థాయి సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని చెప్పారు. మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ గా ఉంటే, రెండవ దశ పాపులేషన్ ఎన్యుమరేషన్ గా జరుగుతుందని తెలిపారు. మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా గణన సాగుతుందని చెప్పారు. జనాభా గణన డేటా ప్రణాళిక, విధాన అభివృద్ధి సమాజ అవసరాలను అర్థం చేసుకోవడానికి కీలక మైనదిగా ఆయన వివరించారు.

====================

జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో ఆమె ఈరోజు సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని, అలాగే.. 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా.. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు 81,001 మంది హాజరవుతున్నారని, 85 కేంద్రాల్లో థియరీ పరీక్షలు జరగనున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మురళీధరన్ సమావేశంలో వివరించారు.

====================

రాష్ట్రంలోని చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శాసనసభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ పురావస్తు తవ్వకాలను ముమ్మరం చేయడంతో పాటు బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. బౌద్ధమత వ్యాప్తికి నిలయాలైన అమరావతి, నాగార్జునకొండ, ఘంటసాల, ఆదుర్రు, తొట్లకొండ, బావికొండ, చిత్రకోట వంటి ప్రాంతాలను కలిపి 'బౌద్ధ సర్క్యూట్'గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపులను ఉపయోగించుకుని అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు.

====================

హిందూ మహాసముద్రం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంపై విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనంతరం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందందని పేర్కొంది. దీని ప్రభావంతో రేపు, ఎల్లుండి.. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు ప్రజలు చెట్ల క్రింద ఉండరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

====================

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వట్లూరులోని సర్ సి.ఆర్.ఆర్.మహిళా కళాశాలలో ఈరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ.. సమ సమాజ స్థాపన కోసం ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఈ తరహా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

====================
====================